సాక్షి ప్రకాశం

ఆదివారం । 25 । జూన్ । 2023



గిరిజనుల సంక్షేమమే ధ్యేయం

గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సురేష్ అన్నారు. పాలుట్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. - 8లో..



తెలుగింటి అతిథి

పశ్చిమ ఆసియా, దక్షిణ హిమాలయాల నుంచి అద్దంకి మండలం వెల్లంవారిపల్లికి ఏటా వలస వచ్చే పెయింటెడ్ స్టార్క్ పక్షులు నందడి చేస్తున్నాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
33 /27

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్‌గా సుధాకర్



సుధాకర్‌ను అభినందిస్తున్న జీజీహెచ్ అధికారులు

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ వైద్య కళాశాల (మెడికల్ కాలేజి) ప్రిన్సిపాల్‌గా అనాటమీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సీహెచ్ సుధాకర్‌కు పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన సాల్మన్ రాజు గుంటూరు బదిలీ కావడంతో ఆ స్థానంలో సుధాకర్‌ను (ఎఫ్ఏసీ)గా నియమించింది. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌కు పలువురు ప్రొఫెసర్‌లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఇతర అధికారులు కలిసి అభినందనలు తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ఈ నెల 26 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు జరిగే ఓపెన్ స్కూల్ సొసైటీ కింద ఎస్ఎస్‌సీ, ఇంటర్మీయెట్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో పక్కాగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఏఎన్ఎంను పరీక్ష కేంద్రాల వద్ద ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జెరాక్స్, ఇంటర్‌నెట్ కేంద్రాలను మూసి వేయాలని ఆదేశించారు. ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను నియమించి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. దీనిలో డీఈఓ రమేష్, ఇతర అధికారులు మారుతి, నాగరాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాతులు.. బంగారం

బాతుగుడ్లు బంగారం కానున్నాయి. కాసుల వర్షాన్ని కురిపించనున్నాయి. మహిళలు ఆర్థికంగా ఎదగడంలో ఇవి భాగస్వామ్యం కానున్నాయి. బాతుగుడ్ల హేచరీల ఏర్పాటుతో తక్కువ సమయంలో ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చు. అత్యాధునిక పరికరాలు సైతం అందుబాటులోకి రావడం నిర్వాహకులకు వరంగా మారనుంది. జిల్లాలో సింగరాయకొండ మండలంలో ఏకంగా 11 హేచరీలు అందుబాటులోకి రానున్నాయి. ఇవి సోమవారం ప్రారంభమవుతున్నాయి.

- హేచరీలతో డ్వాక్రా మహిళకు కాసుల వర్షం
- అధునాతన పరికరాలతో లాభాల పంట
- సింగరాయకొండలో 11 హేచరీలు
- ఒక్కో యూనిట్‌కు రూ.10 లక్షలు రుణం
- డ్వాక్రా మహిళలకు రూ. 3.5 లక్షల సబ్సిడీ
- సెర్ప్, బ్యాంకులు సంయుక్తంగా యూనిట్ల ఏర్పాటు



సింగరాయకొండ: డ్వాక్రా మహిళలు ఆర్థికంగా, పారిశ్రామికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సెర్ప్, బ్యాంకుల సౌజన్యంతో ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ ప్రోగ్రాం ద్వారా సబ్సిడీ పై రుణాలను అందిస్తోంది. దీని కింద సింగరాయకొండ మండలంలో 11 బాతుగుడ్ల హేచరీలు ఏర్పాటు కానున్నాయి. సింగరాయకొండ మండలంలోని కనుమళ్ల పంచాయతీ పెద్ద కనుమళ్ల, మూలగుంటపాడు గ్రామాల్లో వీటిని ప్రారంభించనున్నారు. నాలుగు నెలల క్రితం సెర్ప్ సూచనలతో డీఆర్‌డీఏ పీడీ బీ బాబూరావు ఆధ్వర్యంలో పెద్ద కనుమళ్లలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. 35 మంది మహిళలు హేచరీల ఏర్పాటుకు ముందుకు వచ్చారు. చివరకు 11 మందితో యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఒక్కో యూనిట్ రూ.11 లక్షలు

ఒక్కో యూనిట్‌కు రూ.11 లక్షల వరకూ వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. రూ.లక్ష లబ్ధిదారురాలు భరిస్తే రూ.10 లక్షల రుణం సబ్సిడీపై బ్యాంకులు రుణాలు ఇస్తాయి. డ్వాక్రా సంఘం సభ్యురాలైతే చాలు ఎటువంటి హామీలు లేకుండా వ్యక్తిగత రుణం అందిస్తుంది. మిషన్ కొనుగోలుకు రూ.7.16 లక్షలు, జనరేటర్ కొనుగోలుకు రూ.3.93 లక్షలు ఖర్చవుతుంది. మిషన్ ఏర్పాటైన తరువాత వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇస్తారు. ఈ సర్టిఫికెట్‌ను బ్యాంకుకు ఇవ్వగానే వీరికి రావాల్సిన సబ్సిడీ మొత్తం రూ.3.50 లక్షలు వెంటనే లబ్ధిదారుని బ్యాంకు ఖాతాకు జమవుతుంది. మిగిలిన మొత్తాన్ని వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. మిషన్ ఏర్పాటుకు అవసరమైన షెడ్‌ను మాత్రం లబ్ధిదారులు నిర్మించుకోవాలి.



బాతుగుడ్ల హేచరీ షెడ్‌తో పాటు నూతనంగా కొనుగోలు చేసిన జనరేటర్

సబ్సిడీ ఇలా..

గతంలో డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇచ్చేవారు. తాజాగా వ్యక్తిగతంగా సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తున్నారు. వ్యక్తిగత హామీపై రూ.2 లక్షల నుంచి పది లక్షలు, ప్రాపర్టీ షూరిటీపై రూ.50 లక్షల వరకు రుణాలు ఇస్తారు. గ్రామీణ ప్రాంత మహిళలకు 35 శాతం, పట్టణ ప్రాంత మహిళలకు 25 శాతం సబ్సిడీ వస్తుంది. ఈ యూనిట్ల ఏర్పాటుకు ఎటువంటి పరిమితులు లేవు. ఎంతమందికైనా రుణాలు ఇస్తారు. అయితే డ్వాక్రా సంఘంలో సభ్యురాలై ఉండాలి.

గుడ్డు రూ.7 .. పిల్ల రూ.20:

తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి గుడ్లను తెచ్చుకుంటారు. రూ.6 నుంచి రూ.7 లకు కొనుగోలు చేస్తారు. 28 రోజుల పాటు పొదుగుతారు. వచ్చిన వాటిని ఒక్కో పిల్లను రూ.18 నుంచి రూ.20 మధ్య విక్రయిస్తారు. ప్రస్తుతం అధునాతన పరికరాలు, జనరేటర్ అందుబాటులోకి రావడంతో గుడ్ల డ్యామేజీ తగ్గుతుంది. గతంలో 10 వేల గుడ్లు తీసుకొస్తే కరెంటు కోతలు, వాతావరణ ప్రభావాలతో దాదాపు 50 శాతం పాడైపోయేవి. ప్రస్తుతం కరెంటు పోతే జనరేటర్ అందుబాటులోకి రావడంతో డ్యామేజీ తగ్గుతుంది. పిల్ల నాణ్యత, ఎదుగుదల కూడా బాగుంటుంది. పాత మిషన్లకు, వీటికి కరెంటు బిల్లు నెలకు సుమారు రూ.15 వేలు తక్కువ అవుతుంది. గతంలో అసలు వచ్చేది. ప్రస్తుతం లాభాలే తప్ప నష్టం అనేది ఉండదు. పిల్లల్ని తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌ఘఢ్, కేరళ, కర్నాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు.



బాతుగుడ్ల మిషన్ లోపలి భాగాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

టీడీపీ హయాంలో నిధుల కొరత

గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో మండలానికి రూర్బన్ పథకం మంజూరైంది. పరిశ్రమల ఏర్పాటుకు కోటి రూపాయలు కేటాయించారు. ఆ సమయంలో ఇద్దరు హేచరీ ఏర్పాటుకు ముందుకు వచ్చారు. అయితే నిధులు రాకపోవడంతో అవి ఏర్పాటు కాలేదు.

గతంలో అంతా నష్టమే..

పెద్ద కనుమళ్ల ఎస్టీ కాలనీలో లబ్ధిదారులు గతంలో షెడ్, మిషన్ ఏర్పాటు చేసుకుని హేచరీ నిర్వహించారు. ఖర్చుకు తగ్గ ఆదాయం రాకపోవటంతో అవి మూతపడ్డాయి. పాత మిషన్‌లో కేవలం 15 ట్రేల ఏర్పాటుకు అవకాశం ఉండగా కొత్త మిషన్‌లో 60 ట్రేలు ఏర్పాటుకు చేసుకోవచ్చు. దీంతో ఒకేసారి ఎక్కువ పిల్లలు ఉత్పత్తి చేయటానికి అవకాశం కలగటంతో ఖర్చు గణనీయంగా తగ్గి లాభదాయకంగా ఉంటుందని లబ్ధిదారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

హేచరీల ప్రారంభం రేపు

హేచరీలను ఈనెల 26 సోమవారం రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ప్రిన్సిపల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ రాజశేఖర్ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ, ఎండీ ఇంతియాజ్, కలెక్టర్ దినేష్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ బీ బాబూరావు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారు.

ఎంత మందికైనా యూనిట్ల ఏర్పాటు



పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంసీ పథకాల ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు లబ్ధిదారులు ముందుకొస్తే ఎంత మందికైనా యూనిట్లు ఏర్పాటు చేస్తాం. ఇందులో పరిమితులు లేవు. పీఎంఈజీపీ పథకానికి గ్రామీణ ప్రాంతమైతే 35 శాతం, అర్బన్ అయితే 25 శాతం సబ్సిడీ వస్తుంది. పీఎంఎఫ్ఎంసీ పథకానికి ఎవరికైనా 35 శాతం సబ్సిడీ లభిస్తుంది.

– బీ సుబ్బారావు, డీపీఎం బ్యాంకు లింకేజ్, డీఆర్‌డీఏ, ఒంగోలు

గతంలో ఏ ప్రభుత్వం ఇంత రుణం ఇవ్వలేదు



పీఎంఈజీపీ పథకం ద్వారా బాతుగుడ్ల హేచరీ ఏర్పాటు చేసుకున్నాను. డ్వాక్రా మహిళ కావటంతో బ్యాంకు రూ.10 లక్షల వరకు వ్యక్తిగత రుణం ఇచ్చింది. గతంలో ఏ ప్రభుత్వం ఇంత మొత్తంలో రుణం ఇచ్చి ఆదుకోలేదు. జగనన్న ప్రభుత్వంలో వరికూటి సహకారంతో ఇది సాధ్యమైంది.

– దేవరకొండ అనూష, డ్వాక్రా మహిళ, పెద్ద కనుమళ్ల

కొత్త మిషన్‌తో లాభమే..



పీఎంఈజీపీ పథకం ద్వారా బాతుగుడ్ల హేచరీ ఏర్పాటు చేసుకున్నాను. బ్యాంకు రూ.10 లక్షల రుణం ఇచ్చింది. మిగిలిన మొత్తంతో మిషన్, జనరేటర్ కొనుక్కున్నాను. ఈ మిషన్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ పిల్లలను ఉత్పత్తి చేయవచ్చు. దీంతో ఈ వ్యాపారం లాభసాటిగా ఉంటుంది.

– కట్టా సుబ్బులు, డ్వాక్రా మహిళ, పెద్ద కనుమళ్ల

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ అశోక్ వర్థన్



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ప్రేమ్ కుమార్

తాళ్లూరు: లక్కవరంలో మాజీ సర్పంచ్ టీవీ సుబ్బారెడ్డి కుటుంబంపై దాడికి యత్నించిన అదే గ్రామానికి చెందిన పేరం వెంకటేశ్వర రెడ్డిని శనివారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. పోలీసుల కథనం ప్రకారం... లక్కవరం గ్రామానికి చెందిన పేరం వెంకటేశ్వరరెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఉద్యోగం పోగొట్టుకున్నాడు. గ్రామంలో మాజీ సర్పంచ్ టీవీ సుబ్బారెడ్డి పెత్తనం కొనసాగుతుండటంతో ఆయనపై ఈర్ష పెంచుకున్నాడు. వెంకటేశ్వరరెడ్డి గ్రామంలో కొంత స్థలం ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకున్నాడు. దానిని కూడా మాజీ సర్పంచ్ కుటుంబీకులు అడ్డుకున్నారు. ఉద్యోగం పోగొట్టుకోవటానికి కూడా అదే కుటుంబం కారణమంటూ వెంకటేశ్వరరెడ్డి తరచూ దుర్భాషలాడుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో మాజీ సర్పంచ్ టీవీ సుబ్బారెడ్డి తల్లిదండ్రులు కామిరెడ్డి, అంజమ్మల నివాసం వద్దకు నిందితుడు పేరం వెంకటేశ్వర రెడ్డి శుక్రవారం వెళ్లి తనపై ఎందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారంటూ వాదనకు దిగాడు. దీంతో గమనించిన మాజీ సర్పంచ్ అనుచరుడు తూము సుబ్బారెడ్డి.. ఎందుకు వచ్చావని నిందితుడితో మాట్లాడుతుండగా అతనిపై కత్తితో దాడికి దిగాడు. మాజీ సర్పంచ్ టీవీ సుబ్బారెడ్డిని, అడ్డుకున్న తూము సుబ్బారెడ్డిని ఒకే సారి చంపాలనుకున్నానని, మాజీ సర్పంచ్ ఎక్కడ అంటూ వెంకటేశ్వరరెడ్డి దాడికి దిగాడు. తూము సుబ్బారెడ్డికి ఎడమభుజానికి, కుడిచేతి మణికట్టుపైన గాయాలయ్యాయి. దీంతో కేకలు వేయగా చుట్టు పక్కలవారు వచ్చి నిందితుడిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



నిందితుడు వెంకటేశ్వరరెడ్డి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని దర్శి డీఎస్పీ అశోక్ వర్థన్ రెడ్డి హెచ్చరించారు. లక్కవరం గ్రామాన్ని శనివారం సందర్శించిన ఆయన ప్రజలతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో చిన్న చిన్న విషయాలపై ఘర్షణ పడకుండా శాంతి యుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్నపాటి ఘర్షణలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని హితబోధ చేశారు. ఆయన వెంట దర్శి సీఐ భీమానాయక్, ఎస్సై ఉన్నారు.

షాపింగ్ మాల్‌లో భారీ అగ్నిప్రమాదం



దుకాణంలో ఎగిసిపడుతున్న మంటలు



దుకాణం లోపలి వైపు తగల బడుతున్న దృశ్యం

- రూ.3 కోట్ల ఆస్తి నష్టం
- విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణం

దర్శి: షాపింగ్ మాల్‌లో షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం జరిగి రూ.3 కోట్ల వరకు ఆస్తినష్టం సంభవించిన ఘటన శనివారం తెల్లవారుజామున దర్శిలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. దర్శి పట్టణ నడిబొడ్డులోని సెల్‌ఫోన్ టవర్ బజారులో మేడా హనుమంతరావు మూడు అంతస్తులు గత ఏడాది ఆగస్టులో నిర్మించారు. కింది, మొదటి అంతస్తుల్లో దుస్తుల దుకాణం, రెండో అంతస్తులో నివాసం, ఆపైన పెంట్ హౌస్ ఉన్నాయి. రెండో అంతస్తులో నివాసం ఉండేందుకు వచ్చేనెల 10వ తేదీన చేరేలా ముహూర్తం కూడా పెట్టుకున్నారు. రోజులాగే శుక్రవారం రాత్రి గం .9.30కు దుస్తుల దుకాణం మూసేసి ఇంటికెళ్లారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో కింది ఫ్లోర్‌లోని దుకాణంలో షార్ట్ సర్క్యూట్ అయినట్లు అనుమానిస్తున్నారు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో భవనం లో నుంచి పొగలు వస్తున్నాయని గమనించిన స్థానికులు హనుమంతరావుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసేసరికి మంటలు పెద్దవి అయి పై అంతస్తు దాకా వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయడంతో రెండు అగ్నిమాపక శకటాలు వచ్చి మంటలు అదుపు చేశాయి. మూడో అంతస్తులో ఇంటి పనిచేస్తున్న కూలీలు పడుకుని ఉన్నారు. వారికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి పక్క భవనం నుంచి కిందకు తీసుకొచ్చారు. షాపులో దుస్తుల సరుకు సుమారు రూ.1.50 కోట్ల వరకు ఉంది. కౌంటర్‌లో నగదు రూ.15 లక్షలు మొత్తం అగ్నికి ఆహుతయ్యాయి. షాపు, ఇంటి ఫర్నిచర్‌తో కలిపి మరో కోటి రూపాయల వరకు ఉంటుంది. మొత్తం బుగ్గిపాలైందని బాధితుడు వాపోయాడు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది స్పందించినా దుస్తులు కావడంతో మంటలు భారీ స్థాయిలో ఎగిసి పడ్డాయి. అతి కష్టం మీద శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పక్క భవనాలకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. స్థానికులు కూడా తమ వంతు సహకరించారు. ఎస్సై రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ నియంత్రించి మంటలు ఆర్పేందుకు సహకరించారు.

అగ్ని ప్రమాద బాధితునికి బూచేపల్లి పరామర్శ

దర్శి: షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగి రూ.3 కోట్ల వరకు నష్టపోయిన మేడా హనుమంతరావు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యాన్నిచ్చారు. ఆయన వెంట మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కేవీరెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, నాయకులు వెన్నపూస బాపిరెడ్డి, విలియం కేరి, శ్రీనివాసరెడ్డి, నరశింహారెడ్డి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

జగనన్న సురక్ష ఇంటింటి సర్వే ప్రారంభం

- జిల్లా వ్యాప్తంగా తొలిదశలో 1082 మంది వలంటీర్లు ఇంటింటికీ

ఒంగోలు అర్బన్: అర్హత ఉండి ఏదైనా కారణంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందుకోని వారికి వాటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. వలంటీర్లు వారి పరిధిలో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. శనివారం నుంచి ఈ నెలాఖరు వరకు జరిగే ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని సచివాలయాల ఇన్‌చార్జ్ ఉషారాణి పర్యవేక్షిస్తున్నారు. తొలిదశలో జిల్లా వ్యాప్తంగా 87 సచివాలయాల పరిధిలో 1082 మంది వలంటీర్లు 10,561 గృహాలకు తిరిగి వివరాలు సేకరించారు. ఒంగోలు డివిజన్ పరిధిలో 30,422 గృహస్తులకు 3463 గృహాలు, కనిగిరి డివిజన్‌లో 30,526 గృహస్తులకు 2755 గృహాలు, మార్కాపురం డివిజన్ పరిధిలో 29006 గృహస్తులకు 4343 గృహాలు సందర్శించి సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలపై సర్వే నిర్వహించారు. ఒంగోలు డివిజన్‌లో 317 మందివలంటీర్‌లు, కనిగిరి డివిజన్‌లో 336, మార్కాపురం డివిజన్‌లో 429 మంది వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వే, క్యాంపులు అయిన తర్వాత ప్రజలు ఎవరైనా అర్హత ఉండి పథకం అందలేదని లేదా సేవలు అందలేదనికానీ ఇంటికి వచ్చి వివరాలు సేకరించలేదని కానీ ఫిర్యాదు వస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దినేష్ కుమార్ హెచ్చరించారు.



ఏడుగుండ్లపాడులో జగనన్న సురక్ష సర్వేని పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

క్లుప్తంగా

ఓపెన్ వర్శిటీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023–24 విద్యా సంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడిందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శర్మ కాలేజీ రీజినల్ కో ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ రెండు సంవత్సరాలు, పాలిటెక్నిక్ 3 సంవత్సరాలు, ఇంటర్ ఒకేషనల్, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఇంటర్ ఓపెన్ స్కూల్, ఎన్ఓఎస్ ద్వారా ఉత్తీర్ణులైన వారు కూడా డిగ్రీలో చేరవచ్చన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓవీ.ఏసీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి మార్కుల జాబితా నకలు, ఇంటర్ మార్కుల జాబితా నకలు, కుల ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డు నకలు, ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో సబ్‌మిట్ చేయాలన్నారు. దరఖాస్తును జూలై 30వ తేదీలోగా సమర్పించాలని, పూర్తి వివరాలకు సెల్ నంబర్ 7382929613ను సంప్రదించాలని సూచించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి


మహిళ మృతదేహం

ఒంగోలు టౌన్: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతిచెందిన సంఘటన ఒంగోలు రైల్వేస్టేషన్‌లోని మూడో నంబర్ ప్లాట్‌ఫాం వద్ద రైలు పట్టాలపై శనివారం జరిగింది. సుమారు 60 ఏళ్ల వయసు గల మహిళ పసుపు రంగు చీర ధరించి ఉంది. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే ఎస్సై పి.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 94905 66577 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జంధ్యాల భాస్కర శాస్త్రి మృతి


జంధ్యాల భాస్కరశాస్త్రి (ఫైల్)

జరుగుమల్లి (సింగరాయకొండ): ప్రసిద్ధ నర్శింగోలు శనీశ్వరాలయం ప్రధాన అర్చకులు, ప్రముఖ పంచాంగ శ్రవణకర్త జంధ్యాల భాస్కరశాస్త్రి శనివారం అనారోగ్యకారణంగా మృతి చెందారు. ఆదివారం భాస్కర శాస్త్రికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు వివరించారు.


ఆకాశంలో ఆశల హరివిల్లు.. అంటూ వెల్లంవారిపల్లెలో విహరిస్తున్న పెయింటెడ్ స్టార్క్స్ పక్షులు


చెట్టే ఆవాసాలుగా..


తమ పిల్లలకు గూడు కడుతూ..


చిన్న తనంలో ఈ పక్షులకు తెల్లగా ఉంటాయి..


గ్రామంలో ఉన్న చెరువులే ఈ పక్షులకు ఆధారం. వీటిలో చేపలను తింటూ.. నీరు తాగుతున్న పెయింటెడ్ స్టార్క్స్ పక్షులు

తెలుగింటి అతిథి



సాంకేతికత పేరుతో మనిషి ఎన్నో రకాల విధ్వంసాలు సృష్టిస్తున్నా.. ప్రకృతిలో పుట్టిన జీవులు మాత్రం మనల్ని ప్రేమిస్తూనే ఉంటాయి. మానవునితో కలిసిమెలిసి ఉండటానికి ఇష్టపడుతూనే ఉంటాయి. సెల్‌టవర్ల ధాటికి అరుదైన పక్షుల జాతులు నిర్వీర్యమై పోతున్నాయంటూ ప్రకృతి ప్రేమికులు ఆందోళనలు వ్యక్తం చేస్తూనే ఉంటారు. కానీ వారిమాట ఎవరు వింటారు? ఇదిలా ఉన్నా మాట్లాడలేని అందమైన పక్షులు ఉమ్మడి ప్రకాశం జిల్లా అద్దంకి మండలంలోని వెల్లంవారిపల్లి గ్రామానికి ప్రతి ఏడాది వచ్చి పోతుంటాయి. ఈ గ్రామం చుట్టూ ఉండే పచ్చన చెట్లు.. ఊరి మధ్యలో ఉన్న రెండు చెరువులు.. కొండలు 'పెయింటెడ్ స్టార్క్' అనే పక్షుల మనసు దోచుకుంటున్నాయి. ఇక్కడే వాటికి కావాల్సిన ఆహారం.. నీరు దొరుకుతుండటంతో ఎండాకాలంలో ఇక్కడకు వలస వచ్చి పిల్లల్ని కని అవి పెద్దవైన తర్వాత వెళ్లిపోతుంటాయి. ఈ జాతి పక్షులు పశ్చిమ ఆసియా ప్రాంతం, దక్షిణ హిమాలయాల ఎగువున నివాసాలు ఏర్పాటు చేసుకొని.. సీజనల్‌గా ఇటువైపు వచ్చి వెళుతుంటాయి. ఇక ఆ అతిథులు వచ్చినప్పుడు స్థానికులు ఎగిరి గంతేస్తుంటారు. శుభసూచికంగా భావించి.. వాటికి ఎలాంటి ఇబ్బందులు కలుగనీయకుండా కన్న బిడ్డల్లా చూసుకుంటారు.

– ఫొటోలు: ఎం. ప్రసాద్, ఒంగోలు

జిల్లావ్యాప్తంగా నో యాక్సిడెంట్ డే


రోడ్డు భద్రతా నియమాలను వివరిస్తున్న ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన

ఒంగోలు టౌన్: నో యాక్సిడెంట్ డేలో భాగంగా శనివారం జిల్లావ్యాప్తంగా పోలీసు అధికారులు రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్పీ మలికాగర్గ్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో బ్లాక్ స్పాట్ల వద్ద వేగ నియంత్రణ సూచిస్తూ ఫ్లెక్సీలు, రేడియం స్టిక్కర్లతో బోర్డులు ఏర్పాటు చేశారు. రోడ్డు భద్రత, అతి వేగం, హెల్మెట్ వంటి విషయాలపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారానికి మెరుగుపెట్టిస్తానని మోసం

ఒంగోలు టౌన్: చికిత్స కోసం హాస్పిటల్‌కు వచ్చే వారిని పరిచయం చేసుకుని తక్కువ కూలితో బంగారానికి మెరుగుపెట్టిస్తానని చెప్పి మోసం చేస్తున్న కాంపౌండర్‌పై ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నగరంలోని గద్దలగుంటకు చెందిన మాదిరెడ్డి నాగలక్ష్మి చికిత్స కోసం ఓ ప్రైవేటు చిన్నపిల్లల హాస్పిటల్‌కు వెళ్లింది. అక్కడ కాంపౌండర్‌గా పనిచేస్తున్న సునీత్‌బాబు బంగారు నగలుకు తక్కువ కూలితో మెరుగుపెట్టించి ఇస్తానని నమ్మించాడు. దాంతో రెండు చెవికమ్మలు, రెండు గాజులు, హారం ఇచ్చింది. మరుసటిరోజు ఒక ప్యాకెట్ తెచ్చిచ్చి రూ.500 తీసుకున్నాడు. కాసేపటి తర్వాత ప్యాకెట్ తెరిచి చూస్తే అందులో రోల్డ్ గోల్డ్ నగలు ఉన్నాయి. వెంటనే హాస్పిటల్ వద్దకు వెళ్లి నిలదీయగా మాటమార్చడమే కాకుండా ఇష్టం వచ్చినట్లు దూషించాడు. చంపుతానని బెదిరించాడు. నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గిరిజనుల సంక్షేమమే ధ్యేయం

- వారి జీవన ప్రమాణాలు పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యం
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్


సభలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: గిరిజనుల జీవన ప్రమాణాలు పెంపొందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పెట్టుకుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని పాలుట్ల గిరిజనగూడెంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలు అమలుచేస్తూ అన్ని వర్గాల పేద ప్రజలకు లబ్ధిచేకూర్చుతున్నారని తెలిపారు. ఆయా పథకాలను సక్రమంగా అమలు చేసేందుకు వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ప్రవేశపెట్టారన్నారు. ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలుంటే తెలుసుకుని తక్షణమే పరిష్కరించడానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టి ఇంటి వద్దకే అన్ని శాఖల అధికారులను పంపుతున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఏ మేరకు లబ్ధి పొందారు, ఇంకా ఏమైనా అవసరం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల అవసరాలు తీర్చడానికి పథకాలను క్రమం తప్పకుండా అమలుపరుస్తుంటే.. ప్రతిపక్షాలు మాత్రం గగ్గోలు పెడుతున్నాయన్నారు. లబ్ధిదారుల అకౌంట్లలో నేరుగా నగదు జమ చేయడం ఇష్టంలేని టీడీపీ నాయకులు రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారంటూ విమర్శలకు దిగారని ఆయన అన్నారు. ఏదో ఒక విధంగా సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు చేరకుండా చేయాలన్నదే వారి ప్రధాన ధ్యేయమని విమర్శించారు. అడవిలో నివసిస్తున్న గిరిజనులకు సైతం జగనన్న పథకాలు అందుతున్నాయన్నారు. గతంలో పాలుట్ల గిరిజనగూడెంకు అధికారులు ఎవరైనా వచ్చారా అని ఆయన ప్రశ్నించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినవన్నీ చేస్తారని మాట నిలబెట్టుకోవడానికి ఎంత దూరమైనా వెళ్తారని మంత్రి అన్నారు. ముందుగా పాలుట్లకు వెళ్లే మార్గంలో ఉన్న పెద్దమ్మతల్లి గుడిలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన మొక్కలను గుడివద్ద ఆయన నాటారు. గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి సురేష్ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మార్కాపురం సబ్ కలెక్టర్ సేథు మాధవన్, జార్జి విద్యాసంస్థల అధినేత, మంత్రి తనయుడు ఆదిమూలపు విశాల్, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కె.ఓబుల్‌రెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, పోలిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐ.వి.సుబ్బారావు, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు డి.సుబ్బారెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, పాలుట్ల గిరిజనగూడెం సర్పంచ్ హనిమిబాయి, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఏకుల మునలారెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసులు, డీవైఎస్పీ వీరరాఘవరెడ్డి, ఐటీడీఏ పీవో బి.రవీంద్రరెడ్డి, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, ఎంపీడీవో వై.వి.నాగేశ్వరప్రసాద్, హౌసింగ్ డీఈ సురేష్‌బాబు, డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మీరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, వైద్యాధికారులు ఎం.శ్రీనివాసరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అధికారిక లాంఛనాలతో ఆర్మీ జవాన్ అంత్యక్రియలు

- మృతదేహానికి నివాళులర్పించిన గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు


ఆర్మీ జవాన్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, డీఆర్వో శ్రీలత, తదితరులు

కొమరోలు: విధి నిర్వహణలో ఉన్న ఓ ఆర్మీ జవాన్ గుండెపోటుతో మృతిచెందడంతో అధికారిక లాంఛనాలతో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. కొమరోలు మండలంలోని నల్లగుంట్ల గ్రామానికి చెందిన దండు చిన్నరంగయ్య (45) జమ్ములో జనరల్ రిజర్వ్ ఇంజినీరింగ్ ఫోర్సులో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం విధుల్లో ఉన్న సమయంలో గుండెపోటుకు గురై మృతిచెందాడు. చిన్నరంగయ్య మృతదేహాన్ని స్వగ్రామమైన నల్లగుంట్ల తీసుకొచ్చారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, ప్రకాశం జిల్లా డీఆర్వో శ్రీలత, డిస్ట్రిక్ట్ సైనిక్‌బోర్డు ఆఫీసర్ రజని, తహసీల్దార్ రమాదేవి, ఎస్సై సుబ్బరాజు, తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్మీ జవాన్ మృతదేహాన్ని చూడటానికి గ్రామంలోని వారే కాకుండా చుట్టుపక్కల గ్రామాల వారు కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. చిన్నరంగయ్య అంత్యక్రియలను నల్లగుంట్ల గ్రామంలో అధికారిక లాంఛనాలతో ఆర్మీ అధికారులు పూర్తి చేశారు.

క్షుద్ర పూజలు కాదు.. దేవర కొలుపులే..!


బ్రిడ్జి మీద పూజలు చేసిన ప్రాంతం

ఒంగోలు టౌన్: స్థానిక కొత్తపట్నం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించడంతో పాటు పక్కనే నల్లకోడి తల పడి ఉండటం నగరంలో కలకలం సృష్టించింది. గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో పరిసరాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఈ బ్రిడ్జిపై ఎప్పుడూ వాహనాలు తిరుగుతుంటాయి. సమీపంలోనే రైల్వేస్టేషన్ ఉండటంతో ప్రయాణికులు రాత్రివేళ కూడా రాకపోకలు సాగిస్తుంటారు. కూతవేటు దూరంలోనే డీఎస్పీ కార్యాలయం, టూటౌన్ పోలీసు స్టేషన్ ఉన్నాయి. అలాంటి ప్రదేశంలో క్షుద్ర పూజలు జరగడం ఏంటనే చర్చ నడిచింది. అయితే, చివరకు అది నిజం కాదని తేలింది. ప్రతి ఏడాది యాదవులు దేవర కొలుపులు నిర్వహిస్తుంటారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా నాగార్పమ్మ కొలుపులు నిర్వహించారు. శుక్రవారం రాత్రి నాగార్పమ్మ కొలుపులకు పోయి తిరిగి వచ్చేటప్పుడు పొలిమేర వద్ద పూజలు నిర్వహించి స్వాగతం పలికారు. ఆచార సంప్రదాయాల ప్రకారం పసుపు కుంకుమతో దేవరకు ముగ్గులు వేసి అన్నం కుంభం పోసి పూజలు చేశారు. టెంకాయ కొట్టి నల్లకోడిని బలిచ్చారు. పొలిమేరగా పిలుచుకునే రైల్వేస్టేషన్ బ్రిడ్జి కింద పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఈ ఏడాది బ్రిడ్జి మీద నిర్వహించడంతో అసలు విషయం తెలియక క్షుద్ర పూజల పుకార్లు షికార్లు చేశాయని తేలడంతో దుష్ప్రచారానికి తెరపడినట్లయింది.